క్లుప్తంగా

దళిత మృతవీరుల సంస్మరణ సభను విజయవంతం చేద్దాం

కేవీపీఎస్ మండల అధ్యక్షుడు అంజిలప్ప



సమావేశమైన కేవీపీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన దళిత మృతవీరుల సంస్మరణ సభకు హాజరవ్వాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేవీపీఎస్) మండలాధ్యక్షుడు మ్యాతరి అంజిలప్ప పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొత్తూరులో మహనీయుల విగ్రహాల వద్ద ఆదివారం సమావేశమై మాట్లాడారు. దళిత అమలరవీరుల ప్రాణత్యాగాలను స్మరించుకుని వారి స్ఫూర్తిలో కొనసాగేందుకు ఈనెల 17న తాండూరు పట్టణంలో సంస్మరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి అంజి, సహాయ కార్యదర్శి శ్రీను, మాజీ సర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు.

విద్యుత్ బల్బుల వితరణ



విద్యుత్ బల్బులు అందజేస్తున్న వివేకానంద సంఘం అధ్యక్షుడు రాజు

తాండూరు రూరల్: మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వివేకానంద యువజన సంఘం సభ్యులు విద్యుత్‌దీపాలు వితరణ చేశారు. కొంత కాలంగా గ్రామంలో విద్యుత్‌బల్బులు లేక గ్రామం అంధకారంలో మగ్గుతోంది. విషయం తెలుసుకున్న వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఉప్పరి రాజు ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ కార్యాలయం కార్యదర్శి రవికుమార్‌కు బల్బులు, హోల్డర్లు, విద్యుత్ వైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పరి నర్సింలు, బాల్‌రెడ్డి, భీంరెడ్డి, యాదప్ప, నాగరాజు, యాదప్ప పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



బాధితురాలికి ఎల్‌ఓసీ అందజేస్తున్న నాయకులు

ధారూరు: మండల పరిధిలోని మున్నూరు సోమారం గ్రామానికి చెందిన బైండ్ల సువర్ణకు రూ.2లక్షల ఎల్‌ఓసీని ఆదివారం వికారాబాద్ క్యాంపు కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ అందజేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ చొరవతో ఆమెకు ఆస్పత్రిలో వైద్య ఖర్చుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయం మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుజ్జయ్యగౌడ్, రవి ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్



లింక్ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

దుద్యాల్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుదురుమల్ల–హస్నాబాద్ లింకు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రోడ్డు సౌకర్యాలు మెరుగు పడుతున్నాయని, పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రఘుపతి, లాలప్ప, నర్సింలు, వెంకట్‌రెడ్డి, రమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిజ్వార్‌లో బోనాలు



ఊరడమ్మ ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో ఆదివారం ఊరడమ్మ అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి, పంటలు సల్లంగా చూడాలని వేడుకున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీకి పైసా వసూల్!

- ఒక్కో రైతు నుంచి రూ.50 చొప్పున..
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కర్షకులు

దోమ: ఫార్మర్ రిజిస్ట్రీకి మండల వ్యవసాయాధికారులు కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. అధికారుల పర్యవేక్షణలోపం ఏఈఓలకు వరంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతు రిజిస్ట్రీ చేయాలంటే డబ్బులు వసూలు చేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

రైతులకు 11 అంకెల నంబర్

మండల పరిధిలో 36 గ్రామ పంచాయతీలలో 16,606 మంది రైతులు ఉండగా ఐదు వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. క్లస్టర్‌కు ఓ వ్యవసాయ విస్తరణ అధికారి ఆయా గ్రామాలకు వెళ్లి రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, భూమి విస్తీర్ణం, రకం, పండిస్తున్న పంటలు, ఆధార్ నంబర్‌తో లింక్ అయిన రైతు మొబైల్ నంబర్ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి 11 అంకెల నంబర్ గల డిజిటల్ ఫార్మర్ ఐడీని రైతుకు జారీ చేస్తున్నారు.

ఇతర వ్యక్తులకు లాగిన్

మోత్కూర్ క్లస్టర్‌లోని ఏఈఓకు మాత్రం మోత్కూర్‌తో పాటు ఐనాపూర్, ఖమ్మనాచారం, దోర్నాల్‌పల్లి గ్రామాలున్నాయి. వాటిలో ఐనాపూర్‌లో ఓ వ్యక్తికి ఏఈఓ అధికారిక లాగిన్, ఐడీ ఇచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను చేయిస్తున్నారు. కార్డు జారీ చేయాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని ఏఈఓ రైతులకు కొత్త నిబంధనలు పెట్టడంతో చేసేది లేక సదరు వ్యక్తికి రూ.50 ఇచ్చి ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను చేయించుకుంటున్నారు. ఈ ప్రక్రియను ఏఈఓలు గ్రామాలకు వచ్చి ఉచితంగా ఆన్‌లైన్ నమోదు చేసి ఐడీ ఇవ్వాల్సి ఉంది. కానీ ఏఈఓలు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తూ ఐడీలు, లాగిన్‌లు ఇతర వ్యక్తులకు ఇవ్వడంతో రైతుల సమాచారం తీవ్ర గందరగోళం అవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈఓలు(ఫైల్)

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ఉచితంగా చేయాలి. రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయం తమ దృష్టికి రాలేదు. క్షేత్ర స్థాయిలో వెళ్లి విచారణ చేపడుతాం. డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.
>
> – ప్రభాకర్‌రావు, మండల వ్యవసాయాధికారి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ధారూరు: ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు హామీలు ఇచ్చి వాటి అమలును మరిచిందన్నారు. హామీలు అమలు చేసేంత వరకు బీఆర్‌ఎస్ పోరాడుతూనే ఉంటుందన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రమౌలి, రాములు, అంజయ్య, హఫీజ్, చెన్నయ్య, నగేశ్ గౌడ్, భీం సేన్, యాత్రా గౌడ్, లక్ష్మయ్య, మహేశ్, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఉదన్‌రావుపల్లి కాంగ్రెస్ నేతలు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గ్రామానికి చెందిన సయ్యద్ మైనుద్దీన్, నీరటి అనురాధ కొంతకాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇదే విషయం ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో బాధితులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రూ.78 వేల చెక్కును మంజూరు చేయించి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కృష్ణ, రమేశ్, శేఖర్, ఎల్లప్ప, గోపాల్, ఆంజనేయులు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

బీఆర్‌ఎస్ హయాంలో బీసీలకు అన్యాయం

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు విశాల

కేశంపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, 33 శాతం ఉన్న రిజర్వేషన్లను 23కు తగ్గించిందని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు గుండె రాణి అధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ తగ్గించిన బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ పార్టీ 23 నుంచి 42 శాతానికి పెంచిదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను పెంచితే జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తన మూలంగానే రిజర్వేషన్లను ప్రభుత్వం పెంచిదనడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినట్లే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని మళ్లీ ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిత్యం ప్రజల సంక్షేమం కోసం కష్టపడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ కవిత ఇంట గెలిచి బయట గెలిచేందుకు కష్టపడాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉంటే మొదటి నాలుగేళ్ల వరకు జాగృతి పనిచేసిందని, తర్వాత ఎందుకు కనుమరుగు అయిందో ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రజలకు తెలపాలన్నారు. అనంతరం రాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో అనసూయ, అరుణ, సుజాత, కళమ్మ, అస్మా, లలిత, సువర్ణ, లక్ష్మీ, మణెమ్మ, నర్సమ్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశాల

హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలి

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

షాబాద్: విద్యార్థిపై బూటు కాలుతో తన్ని, చితకబాదిన హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విద్యార్థి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను విధుల నుంచి తొలగించాలన్నారు. 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాకేశ్‌ను తరగతి గదిలో బంధించి బూటు కాలుతో తన్నడం సరికాదన్నారు. గతంలో హెచ్‌ఎంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని, ఎస్‌ఎంసీ నిధులను కూడా ఆయన పక్కదోవ పట్టిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థిపై దాడి చేసిన విషయమై డీఈఓకు ఫోన్ చేసిన లిఫ్ట్ చేయడంలేదన్నారు. ఆతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థిని పరామర్శిస్తున్న రాజేశ్

పర్యాటక కేంద్రంగా పాంబండ

- మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

కుల్కచర్ల: రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సోమవారం కుల్కచర్లలో పర్యటించనున్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నో తరాలుగా పాంబండ నిరాధారణకు గురైందని, ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాభివృద్ధికి నోచుకోలేకపోయిందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాంబండ ఆలయ అబివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో ముందుకుసాగుతున్నారన్నారు. ఇందులో భాగంగానే నేడు మంత్రి స్వామివారి దర్శనానికి విచ్చేసి వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి–అధ్యక్షుడు భరత్ కుమార్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఆలయ పూజారి దశరథం, నాయకులు రవి, రాంచంద్రయ్య, కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ దరఖాస్తుల గడువు పెంపు

కొత్తూరు: ఓపెన్ ఇంటర్, 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం ఈ నెల 31 వరకు గడువు పెంచినట్లు ఎంఈఓ అంగూర్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ ఇంటర్ ద్వారా ఒకే ఏడాదిలో రెండేళ్ల కోర్సును పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఇంటర్‌కు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. ఓపెన్ టెన్త్‌కు దరఖాస్తు చేసేవారు 14 ఏళ్లు నిండి చదవడం, రాయడం రావాలన్నారు. అనివార్య కారణాలతో చదువు మధ్యలో మానేసినవారు, చదువుపై ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బ్రైటర్‌మైండ్ శిక్షణకు విశేష స్పందన



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న హార్ట్‌ఫుల్‌నెస్ శిక్షకులు

కొత్తూరు: పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం శ్రీరామచంద్రమిషన్ కన్హశాంతి వనం, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ నిర్వాహకులు చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన బ్రైటర్ మైండ్ శిక్షణకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా ఇప్పటికే బ్రైటర్‌మైండ్‌లో శిక్షణ పొందిన పలువురు చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకొని పలు వస్తువులు, వాటి రంగులను చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. అంతేకాకుండా ఇతరులు కాగితంపై గీసిన పలు చిత్రాలను వీరు కళ్లకు గంతలతోనే గుర్తించి కొద్దిగా తేడా లేకుండా తిరిగి వాటిని గీశారు. ఈ సందర్భంగా శిక్షకులు మాట్లాడుతూ.. స్పర్శ, శబ్దం, వాసనతో మెదడు మూడో నేత్రంగా పనిచేస్తోందన్నారు. చిన్న వయస్సు నుంచే బ్రైటర్‌మైండ్‌ను సాధన చేయడంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయంలో ప్రతి ఆదివారం ఉదయం 10 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు పెద్దలకు ధ్యాన ప్రక్రియ సాధనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సభ్యుడు అమర్, శిక్షకులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఒక్కొక్కటిగా హామీల అమలు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

అనంతగిరి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని గంగారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చురుకుగా కొనసాగుతున్నాయన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ అభ్యున్నతికి పాటుపడాలని, సమష్టిగా ముందుకు వెళ్లి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముత్తాహార్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కాంగ్రెస్‌తోనే పేదల కలలు సాకారం



విఠలాపూర్ గ్రామ కమిటీతో మండల నాయకులు

కుల్కచర్ల: పేదల కలలు కాంగ్రెస్‌తోనే సాకారమవుతాయని పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండలం విఠలాపూర్‌లో పార్టీ గ్రామ కమిటీ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులు పార్టీ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ విఠలాపూర్ గ్రామ అధ్యక్షుడిగా బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా రాంచంద్రయ్య, యువజన విభాగం అధ్యక్షుడిగా బుచ్చయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దామోదర్ రెడ్డి, వెంకటయ్య గౌడ్, సలీం, చెన్నయ్య, గోపాల్ నాయక్, రాము, ఖాజ, బాలరాజు, భీమయ్య పాల్గొన్నారు.

తవ్వారు.. పూడ్చడం మరిచారు

అభివృద్ధి పనుల పేరిట చేపట్టిన తవ్వకాలు రైతులకు ఇబ్బంది తెచ్చిపెడుతున్నాయి. మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో పైప్‌లైన్ పనుల కోసం అధికారులు తవ్వకాలు చేపట్టారు. పనులు పూర్తయి రోజులు గడుస్తున్నా వాటిని పూడ్చడం లేదు. దీంతో అటుగా వెళ్లే రైతులు, ట్రాక్టర్లకు ఇబ్బందులు తలెత్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

– దుద్యాల్



సీఎంను విమర్శించడం తగదు

మహిళా కాంగ్రెస్ నేతల ధ్వజం

షాద్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ కవిత విమర్శించడం తగదని పట్టణ మహిళా కాంగ్రెస్ నేతలు నాగమణి, వజ్రమ్మ, చంద్రకళ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతోందన్నారు. మహిళలకు 500లకే సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు వంటి పథకాలను చేపట్టారన్నారు. ఈ పథకాలన్నీ ఎమ్మెల్సీ కవితకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మద్యం దందా చేసి మహిళా లోకం తలదించుకునేలా చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ మహిళల కోసం ఎలాంటి పథకాలు చేపట్టారో కవిత ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో కాంగ్రెస్ సర్కార్ కులగణన చేపట్టి రిజర్వేషన్లు తీసుకొస్తే అది తానే సాధించానని చెప్పుకోవడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కవితకు లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

మండల అధ్యక్షుడు గూడ వీరేశ్

కేశంపేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనేరాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొనాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇళ్లు, నూతన రేషన్‌కార్డుల మంజూరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఇళ్లు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అర్హుల ఎంపికలో ఎలాంటి వివక్షత లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధన మేరకు లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అందించే సంక్షేమ పథకాలతో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో కర్రెడ్ల నర్సింహారెడ్డి, గ్యార సురేష్, సోప్పరి జంగయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, జంగయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు